

కాగడాను అందుకుని యాత్రకు స్వాగతం పలుకుతున్న మంత్రి

రాజీవ్ సద్భావన యాత్రకు స్వాగతం

● దేశం కోసం ప్రాణాలర్పించిన నేత రాజీవ్ గాంధీ: మంత్రి

మక్తల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ సద్భావన జ్యోతి యాత్రకు మంత్రి వాకిటి శ్రీహరి మంగళవారం ఘన స్వాగతం పలికారు. కృష్ణ బ్రిడ్జి నుంచి బిలాల్‌పూర్ వరకు యాత్ర సాగింది. ఈ సందర్భంగా మంత్రి యాత్ర కాగడాను అందుకొని, మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప నేత రాజీవ్ గాంధీ అని అన్నారు. రాజీవ్ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. దేశం సంఘటితం కోసం కృషి చేశారని కొనియాడారు. యాత్ర కృష్ణ మండలం టైరోడ్ నుంచి మక్తల్ మీదుగా నారాయణపేటలోకి ప్రవేశించింది. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, రాజీవ్‌గాంధీ జ్యోతియాత్ర జాతీయ అధ్యక్షుడు దొర్రై, సుజేంద్రశెట్టి తదితరులు పాల్గొన్నారు.




ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలు



మిడ్జిల్‌లో పనులు చేస్తున్న కూలీలు

ఉపాధి హామీకి తూట్లు

ఈ ఆర్థిక సంవత్సరం పని దినాల్లో 50 శాతం కోత..



- గతేడాది ఇచ్చింది 32.43 లక్షల పని దినాలు..
- ఈ ఏడాది ఇచ్చింది 17.78 లక్షలే
- అందులో ఇప్పటికే 70 శాతం అంటే 12.54 లక్షల పని దినాలు పూర్తి
- సిబ్బందికి ఇవ్వని టార్గెట్లు
- పథకాన్ని నీరుగారుస్తున్న కేంద్ర ప్రభుత్వం

పేద ప్రజలకు స్థానికంగా పనులు కల్పించి, వలసలను నివారించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్రం తూట్లు పొడుస్తోంది. పథకంలో నెమ్మదిగా మార్పులు చేస్తూ, రానురాను పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. అడిగిన వారందరికీ పనులు కల్పించడమే ఈ పథక ఉద్దేశ్యం కాగా, పనిదినాలు తగ్గించడం, సిబ్బందికి టార్గెట్‌ల ఊసే లేకపోవడం, మెటీరియల్ పేమెంట్‌లు ఇవ్వడంలో తాత్సారం చేయడం అందుకు అడ్డం పడుతోంది. ఈ నేపథ్యంలో ముందు పథకాన్ని కొనసాగిస్తారా? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- మహబూబ్‌నగర్, (ఆంధ్రజ్యోతి)

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కేంద్రం పని దినాలను 50 శాతం తగ్గించింది. దాంతో పథకాన్ని కొనసాగిస్తారా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 32.43 లక్షల పనిదినాలు కల్పించగా, 32.69 లక్షల పని దినాలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26కు గాను కేవలం 17.78 లక్షల పనిదినాలు మాత్రమే కల్పించడం గమనార్హం. గడిచిన ఐదేళ్లలో ఇంత తక్కువ పని దినాలు కల్పించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. అదే 2023-24లో 31.05 లక్షల పని దినాలు కేటాయించగా 35.13 లక్షల పని దినాలు చేశారు. 2022-23లో 28.06 లక్షల పని దినాలకు 31.68 లక్షలు, 2021-22లో 35.97 లక్షల పనిదినాలకు 36.89 లక్షలు, 2020-21లో 41.86 లక్షల పనిదినాలకుగాను 40.44 లక్షల పనిదినాలు చేశారు.

ఇప్పటికే సగానికిపైగా పూర్తి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభమై 4 నెలలు గడిచింది. ఇప్పటికే కేటాయించిన పని దినాల్లో 12.54 లక్షల పని దినాలు అంటే 70.52 శాతం పూర్తి చేశారు. మరో ఎనిమిది నెలల సమయం ఉండగా మిగిలిన 5 లక్షల పని దినాలు సరిపోవన్న విషయం స్పష్టమవుతోంది. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో పనులు తక్కువగానే జరుగుతాయి. సమ్మర్ సీజన్ జనవరి, ఫిబ్రవరి, మార్చిలో పెద్ద ఎత్తున పనులు సాగుతాయి. అప్పుడు వ్యవసాయ పనులు ఉండవు. కాబట్టి కూలీలు ఎక్కువ సంఖ్యలో పనులకు వస్తారు. ఇక మిగిలిన 5 లక్షల పని దినాల్లో జనవరి నాటికి మరో 2-3 లక్షల పనిదినాలు చేస్తే వేసవికి ఇక పనిదినాలేవీ మిగలవని కూలీలు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ సమస్యను గుర్తించి పనిదినాలు పెంచాలని కేంద్రానికి లేఖ కూడా రాసింది.



అధికారులకు విధించని టార్గెట్‌లు

పథకంలో గతంలో సిబ్బందికి గ్రామానికి 100 మందికి తగ్గకుండా పని చేయాలని లక్ష్యాలను నిర్దేశించేవారు. ఈ లెక్కన జిల్లాలో రోజూ 40-50 వేల మంది పని చేయాల్సి ఉండగా ప్రస్తుతం 1,200 నుంచి 1,500 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ నెలకు 3,000 పనిదినాలు, టెక్నికల్ అసిస్టెంట్ తన పరిధిలోని 7,500 పని దినాలు చేయిస్తేనే జీతాలు చెల్లించాలన్న నిబంధన ఉండేది. ఫీల్డ్ అసిస్టెంట్‌లు తక్కువ పనిదినాలు చేస్తే ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి సీనియర్ మేట్‌కు డిమోట్ చేసేవారు. ఇప్పుడవన్నీ బుట్ట దాఖలయ్యాయి. కేవలం వన మహోత్సవం కార్యక్రమాలకే పథకాన్ని పరిమితం చేశారు. కావాల్సిన పనులు చేయడానికి వీలు లేకుండా కోత విధిస్తోంది. భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా పనులు చేయిస్తున్నారు. ఫాంపాండ్, ఫీడర్ ఛానల్, ఫీల్డ్ చానల్, షిల్ట్, పశువుల షెడ్ల పనులకే పరిమితం చేశారు.

కూలి గిట్టుబాటు కోసం ఒత్తిడి

ప్రస్తుతం కూలీకి రోజూ కొలతలను బట్టి రూ.307 కూలి చెల్లించవచ్చు. అయితే కొలతల ప్రకారం అంత కూలి గిట్టుబాటు కావడం లేదు. పనిదినాలు తక్కువగా ఉన్నందున కూలి గిట్టుబాటుకోసం చర్యలు తీసుకోవాలని అధికారులు సిబ్బందిపై ఒత్తిడి పెంచుతున్నారు. డబ్బులు పెరిగితే కూలీలు సంతృప్తి చెందుతారన్న ఎత్తుగడ కూడా కావచ్చు. ఈ ఏడాది ఇప్పటివరకు సగటున రూ.239.61 కూలి పడింది. గడిచిన ఆరేళ్లలో ఇదే ఎక్కువ కావడం విశేషం. 2024-25లో సగటున రూ.210, 2023-24లో రూ.190.63, 2022-23లో రూ.179.85, 2021-22లో రూ.189.34 కూలి పడింది. ఈ ఏడాది ఇప్పటివరకు రూ.50.95 కోట్లు కూలీలకు చెల్లింపులు చేశారు. మెటీరియల్ పేమెంట్ రూ.31.15 కోట్లు కాగా రూ.10 కోట్ల వరకు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి.



మొక్కను నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మొక్కలను సంరక్షించాలి

● వన మహోత్సవంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి, సంరక్షించడం మనందరి బాధ్యత అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 75వ వన మహోత్సవంలో సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అంధుల పాఠశాల ప్రాంగణంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవులను సంరక్షిస్తేనే వర్షాలు పుష్కలంగా పడతాన్నారు. నాలుగు.. ఐదు సంవత్సరాల పాటు మొక్కలను పెంచి, కాపాడితే ఆ తర్వాత 100 ఏళ్లు ఆ చెట్లు మనందరినీ కాపాడతాయన్నారు. కేవలం మొక్కలు నాటడం కాదని, వాటిని కాపాడాల్సిన బాధ్యతను అందరూ తీసుకోవాలన్నారు. అధికారులు ఉద్యోగంలో చేరిన రోజు, బదిలీ అయిన రోజు, ఉద్యోగ విరమణ పొందినప్పుడు మొక్కలు నాటాలన్నారు. కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ జిల్లాలో 58 లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ధేశించిందన్నారు. అన్ని శాఖలు, సంస్థలు లక్ష్యాలను ఈ నెలాఖరులోగా చేరుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ వారు తయారు చేసిన వన మహోత్సవం స్లోగన్స్ కరపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా అటవీ అధికారి సత్యనారయణ, మునిసిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య సేవలు ఉచితం..

అందడమే గగనం

● మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి దుస్థితి 6

కుడి ఎడమైతే..

పొరపాటు లేదోయ్...

● ఎడమ చేయి వాటంతో ఇబ్బంది లేదు

● అభిప్రాయ పడ్తున్న లెఫ్ట్ హ్యాండర్స్ 6

వదలని వాన

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం 6

ప్రమాదాలు వాటిల్లకుండా

చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ విజయేందిరబోయి



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను తనిఖీ చేసి ఎటువంటి ప్రమాదాలూ జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిరబోయి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కమిటీలు ఏర్పాటు చేసి.. తక్షణమే పరిశ్రమలను తనిఖీ చేయాలన్నారు. తనిఖీ షెడ్యూల్ రూపొందించి, దశలవారీగా తనిఖీలు చేయాలన్నారు. మొదటి దశలో అన్ని రసాయన, ఔషధ పరిశ్రమలను నెలలోపు సమగ్రంగా తనిఖీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కార్మికుల భద్రత పట్టించుకోవాలని, క్రమం తప్పకుండా భద్రత శిక్షణ, మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. ఏ పరిశ్రమ అయినా భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.శ్రీనివాస్‌రావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ కిశోర్, ఇండస్ట్రీస్ జీఎం ప్రతాప్, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేశ్, లేబర్ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌కుమార్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ జంగయ్య పాల్గొన్నారు.

గడువులోగా అనుమతులు ఇవ్వాలి

జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ టీజీ ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు శాఖల నుంచి అనుమతులను నిబంధనల మేరకు గడువులోగా మంజూరు చేయాలని కలెక్టర్ విజయేందిరబోయి చెప్పారు. శుక్రవారం పరిశ్రమల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. టీప్రైడ్ ద్వారా షెడ్యూల్డ్ తెగకు చెందిన మహిళలకు రవాణా సెక్టార్ కింద గూడ్స్ క్యారేజీ వాహనం పెట్టుబడి సబ్సిడీ మంజూరుకు కమిటీలో ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పైపులైన్ పగిలిపోవడంతో ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైకి విరజిమ్ముతున్న మిషన్ భగీరథ నీరు

ఎగసిన గంగ

● జడ్చర్లలో పగిలిన మిషన్ భగీరథ పైపులైను

● ఫ్లైఓవర్ రహదారిపైకి విరజిమ్మిన నీళ్లు

● వాహనదారుల ఇక్కట్లు

జడ్చర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ తాగునీటి పైపులైన్ జడ్చర్ల క్రాస్ రోడ్డులోని సబ్ రోడ్డు వద్ద మంగళవారం పగిలింది. దాంతో నీళ్లు ఫౌంటేన్‌లా ఎగసిపడ్డాయి. పక్కనే ఉన్న ఫ్లైఓవర్‌పై ఉన్న జాతీయ రహదారిపైకి నీళ్లు విరజిమ్మాయి. జాతీయ రహదారిపై, సబ్‌రోడ్డులో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. నీళ్లన్నీ రోడ్డుపై వృథాగా పోయాయి. ఈ పైపులైన్ ద్వారా జడ్చర్ల, రాజాపూర్, బాలానగర్, నవాబ్‌పేట మండలాల్లోని గ్రామాలకు నీరు సరఫరా అవుతుంది. నీళ్లు వృథాగా పోతున్నా సరఫరాను ఆపేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని, గంట తర్వాత సరఫరా బంద్ చేశారని స్థానికులు ఆరోపించారు.



ఒకరి మరణం..

మరికొందరికి జీవితం

అమ్మ జన్మనిస్తే అవయవ దానం పునర్జన్మను ఇస్తోంది.. అవయవాలను దానం చేయడం అంటే మరణించిన తర్వాత కూడా జీవించడమే.. ప్రమాదాల బారిన పడి మరణం అంచున ఉన్న వాళ్లు, బ్రెయిన్ డెడ్‌తో బతికే అవకాశం లేని వారు అవయవదానం చేయడం ద్వారా ఎందరికో ఆయువు పోస్తున్నారు. ఆ సమయంలో వారి కుటుంబ సభ్యులు తీసుకునే నిర్ణయం ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. నేడు అవయవ దాన దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

7

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్

మత్తు రహిత భారత నిర్మాణం

మన బాధ్యత



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మత్తు రహిత భారత నిర్మాణం మన బాధ్యత అని ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పీయూ విద్యా కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నషా ముక్త్ భరత్ అభియాన్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలు మనుషుల ఆరోగ్యం, కుటుంబ సంతోషం, సమాజ ప్రగతికి అడ్డంకులుగా మారతాయన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ రవికాంత్ పాల్గొన్నారు.

భారీ వర్ష సూచన నేపథ్యంలో

అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ సిక్తా పట్నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రానున్న 72 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం మంత్రులు, ఇతర ఉన్నతాధికారులతో సచివాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలోని మక్తల్ మంతన్‌గోడు, ఊట్కూర్, మల్లేపల్లి నాగిరెడ్డిపల్లి, మరికల్, ఇబ్రహీంపట్నం వాగులు అలుగు పారుతున్నాయని ఆయా ప్రాంతాలలో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, శ్రీను, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, జడ్పీ సీఈవో శైలేష్, ఆర్డీవో రామచంద్ర నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థి ఎంపిక



పెద్దకొత్తపల్లి విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి టి.శేఖర్ డిస్కస్‌త్రో విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. నాగర్‌కర్నూల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో డిస్కస్‌త్రో విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ నెల 30, 31వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని ఎంఈవో కేశ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బాలసుబ్రమణ్యం, పెద్దలు అభినందించారు.

బస్సుల రద్దుతో విద్యార్థులకు అవస్థలు

- దుందుభీ నది పారడంతో తెలకపల్లికి నిలిచిన బస్సుల రాకపోకలు



బస్సు కోసం వేచి చూస్తున్న విద్యార్థినులు

కల్వకుర్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : దుందుభీ నది పారడంతో కల్వకుర్తి-తెలకపల్లికి ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో సమయానికి వచ్చే బస్సులు రద్దు కావడంతో విద్యార్థినీ, విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. రఘుపతిపేటకు స్కూల్స్, కళాశాల సమయంలోనైనా బస్సులను నడిపిస్తే విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా ఉంటుంది. కల్వకుర్తి మండలంలోని రఘుపతిపేట, లింగసానిపల్లి, గుండూరు, పంజుగుల గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులు ఉదయం పూట పాఠశాలలు, కళాశాలలకు వస్తూ సాయంత్రం తిరిగి వారి గ్రామాలకు ఆర్టీసీ బస్సుల్లో చేరుకునేవారు. దుందుభీ నది ప్రవహిస్తుండడంతో తెలకపల్లికి బస్సులను రద్దు చేశారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పెచ్చులూడిన లేబర్ కార్యాలయం పైకప్పు



పెచ్చులూడిన లేబర్ కార్యాలయం పైకప్పు

గద్వాల క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శిథిలావస్థలో ఉన్న అసిస్టెంట్ లేబర్ కార్యాలయంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కార్యాలయం లోపల పెచ్చులూడి పడటంతో ఓ మంగళవారం కార్మికుడికి త్రుటిలో ప్రమాదం తప్పింది. దీంతో కార్మికులకు సంబంధించి కార్డుల వివరాల నమోదు కార్యాలయ ఆవరణలోనే చేసినట్లు అసిస్టెంట్ లేబర్ అధికారి వేణుగోపాల్ తెలిపారు.

వర్షానికి కూలిన ఇంటి పైకప్పు

ఉండవల్లి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని ప్రాగటూరు గ్రామంలో బోయ శివన్న, చిట్టెమ్మ దంపతులకు చెందిన ఇంటి పైకప్పు కూలిపోయింది. మట్టి మిద్దె కావడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న ఆర్ఐ నాగరాజు మంగళవారం గ్రామంలోని ఇంటిని పరిశీలించి, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తాత్కాలిక వసతులను కల్పించారు.

కేజీబీవీ వర్కర్లపై ప్రత్యేక అధికారి దాడి

- తొలగించాలని కుటుంబ సభ్యుల ఆందోళన

బల్మూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పని చేస్తున్న కార్మికులపై ప్రత్యేకాధికారి దాడి చేసింది. ఈ సంఘటన మంగళవారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూరు మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఈ పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిపై నిమ్మల చిట్టెమ్మ, కూరాకుల పార్వతమ్మ, నిమ్మల పుష్ప పని చేస్తున్నారు. ప్రత్యేకాధికారి లలిత మంగళవారం దాడి చేసింది. తాను పాఠశాల కోసం లక్షల రూపాయల వరకు ఖర్చు చేశానని, అవి ఎవరు కడతారంటూ వారిపై మండి పడింది. ఈ విషయాన్ని వర్కర్లు కుటుంబ సభ్యులకు, స్థానిక నాయకులను తెలిపారు. వారు పాఠశాలకు చేరుకొని ప్రశ్నించగా, వర్కర్లు సక్రమంగా పని చేయడం లేదని, మద్యం తాగి పాఠశాలకు వస్తున్నారని ఆమె చెప్పారు. తాను మందలించానని, దాడి చేయలేదని స్పష్టం చేశారు. ప్రత్యేకాధికారిని తక్షణమే తొలగించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

వైద్య సేవలు ఉచితం
అందడమే గగనం

- అంతంతమాత్రంగా రోగనిర్ధారణ పరీక్షలు
- చెడిపోయిన యంత్రంతో ఈసీజీ పరీక్షలు
- రోజుకు 40 మందికే యూఎస్‌జీ స్కానింగ్
- ఎక్స్‌రే రిపోర్టు కూడా సకాలంలో ఇవ్వని పరిస్థితి
- మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి దుస్థితి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడ వైద్య సేవలన్నీ ఉచితమే.. కానీ రోగులకు ఆ సేవలు అందడమే గగనం.. రోగ నిర్ధారణకు రక్త నమూనాలు ఇస్తే రిపోర్టులు ఒకటి, రెండు రోజుల్లో వస్తాయి. అది కూడా కొన్ని టెస్టులే చేస్తున్నారు. మిగతావి ఇక్కడా... అక్కడా అంటూ తిప్పుతున్నారు. చెడిపోయిన యంత్రంతో ఈసీజీ తీస్తున్నారు. వచ్చే రిపోర్టులు ఎంత వరకు కచ్చితమో తెలియడం లేదు. యూఎస్‌జీ స్కానింగ్ చేయించుకోవాలంటే తెల్లవారుజామున 5 గంటల నుంచి పడిగాపులు కాయాల్సిందే. అది కూడా ప్రతీ రోజు 40 మందికే టోకెన్లు ఇస్తారు. ఇక ఎక్స్‌రే యంత్రాలు తరచూ మొరాయిస్తున్నాయి. ఎక్స్‌రే తీసిన తర్వాత డాక్టర్‌కు పంపిస్తామని చెప్తారు.

కాని ఎప్పుడు ఇస్తారో తెలియదు. గుండె నొప్పిగా ఉందని వెళితే ఈసీజీ తీస్తారు కానీ అడ్మిట్ అయిన రోగులకే 2డీఈకో తీస్తున్నారు. అది కూడా వారంలో మూడు రోజులే. సీటీ స్కానింగ్ తీసినా, రిపోర్టు వచ్చేందుకు రెండు రోజులు ఆగాల్సిందే. ఇదీ మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవల దుస్థితి.



ఉదయం 6 గంటల నుంచే యూఎస్‌జీ స్కానింగ్ కోసం పడిగాపులు

సకాలంలో అందని రిపోర్టులు

జనరల్ ఆసుపత్రికి అనుసంధానంగా తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ ఉంది. అందులో 52 రకాల వైద్య పరీక్షలు చేస్తారు. ఆసుపత్రిలో సెంట్రల్ ల్యాబ్, ఎంసీహెచ్‌లో ఒక ల్యాబు, ఓపీలో ఒక ల్యాబు ఉన్నాయి. కాని టెస్టులు చేసేది అంతంత మాత్రమే. ప్రతీ రోజు దాదాపు 300 వరకు టెస్టు శాంపిళ్లు వస్తాయి. కానీ రిపోర్టులు మాత్రం రోగులకు సకాలంలో అందడం లేదు. దీంతో రోగులు అదేరోజు రిపోర్టులు తీసుకొని, వైద్యుడికి చూపించుకొని వెళ్లే పరిస్థితి లేదు. రోగనిర్ధారణ అయిన తర్వాత మరో రెండు రోజులు ఆసుపత్రికి రావాల్సిందే. టీహబ్‌లోని యంత్రాలు తరుచూ మొరాయిస్తున్నాయి. ఎక్స్‌రేకు వెళ్లి తీసిన తర్వాత రిపోర్టులు డాక్టర్ ఫోన్‌కు వస్తాయని చెప్పి పంపిస్తున్నారు. కాని అవి మధ్యాహ్నం 12 గంటల తర్వాత వస్తున్నాయి. అంతలోపు డాక్టరు వెళ్లిపోతుండడంతో మరుసటి రోజు రావాల్సి వస్తోంది. ఎక్స్‌రే ఫిల్మ్‌కు ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ ఉంటుంది. కాని అది లేకపోవడంతో సిబ్బంది తమ ఫోన్‌లో ఫొటో తీసుకొని వైద్యులకు పంపిస్తున్నారు. సీటీ స్కానింగ్‌కు రూ. 500 వసూలు చేస్తున్నారు. ఆ రిపోర్టు కోసం కూడా రెండు రోజులు ఆగాల్సిందే.



తరచూ మొరాయిస్తున్న ఎక్స్‌రే మిషన్లు

సేవల మెరుగునకు చర్యలు

జనరల్ ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటాం. సీటీ, యూఎస్‌జీ స్కానింగ్‌ల విషయంలో ఇబ్బందులున్నాయి. ఆ విభాగానికి ఒక్కరే వైద్యుడు ఉండడంతో అన్ని స్కానింగ్‌లు అతడే చూడాల్సి వస్తోంది. దీంతో కొంత జాప్యం జరుగుతోంది. అవసరం ఉన్నవాళ్లకే స్కానింగ్ రాసేలా వైద్యులకు అవగాహన కల్పిస్తాం. ఈసీజీ యంత్రాన్ని బాగు చేయిస్తాం. 2డీఈకోకు సంబంధించి డాక్టర్లు లేరు. కానీ సర్జరీల కోసం ఐఎంఏ సహకారంతో ప్రైవేటు వైద్యులతో 2డీఈకో తీయించి రిపోర్టులు ఇప్పిస్తున్నాం.

– డా. మాధవి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

పాతకాలం యంత్రంతో అవస్థలు

జనరల్ ఆసుపత్రిలో ఈసీజీ మిషన్ చెడిపోయింది. పాతకాలం నాటి యంత్రాన్నే ఇప్పటికీ వాడుతున్నారు. అది తరచూ మొరాయిస్తున్నా, పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఆ యంత్రం స్క్రీన్ పాడైపోవడంతో అక్షరాలు కనిపించడం లేదు. అందాజాగా నొక్కుతూ రిపోర్టులు ఇస్తున్నారు. ఆ రిపోర్టులతో ఎంత వరకు వ్యాధి నిర్ధారణ అవుతుందో తెలియడం లేదు.

యూఎస్‌జీకి తప్పని పడిగాపులు

యూఎస్‌జీ (అల్ట్రాసౌండ్ స్కానింగ్) కోసం రోగులకు పడిగాపులు తప్పడం లేదు. ప్రతీ రోజు 40 మందికి మాత్రమే టోకెన్లు ఇస్తున్నారు. ఆ తర్వాత వచ్చే వారు మరుసటి రోజు తెల్లవారుజామున రావాల్సిందే. దీంతో అత్యవసర పరిస్థితుల్లో స్కానింగ్ అవసరమైన వారు ఇబ్బంది పడ్తున్నారు. వైద్యులు ఉదయం 10 గంటల తర్వాత రౌండ్స్‌కు వచ్చినప్పుడు స్కానింగ్‌లు రాస్తున్నారు. అలాంటి వారు టోకెన్లు లేక ఇబ్బంది పడుతున్నారు. కడుపునొప్పితో వస్తే వైద్యులు కనీసం చూడకుండా, మందులు ఇచ్చి వేచి చూడకుండా స్కానింగ్‌కు రాస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

ఫిట్‌నెస్ కోసమే 2డీఈకో

ఎవరికైనా గుండె నొప్పి వస్తే ఈసీజీ మాత్రమే తీసి, అందులో ఏదైనా సమస్య ఉంటే హయ్యర్ సెంటర్‌కు రెఫర్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో తీస్తున్న 2డీఈకో సర్జరీ సమయంలో మత్తు ఫిట్‌నెస్ కోసమే వినియోగిస్తున్నారు. అది కూడా ప్రైవేటు ఆసుపత్రుల సహకారంతో వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే చేస్తున్నారు.

వదలని వాన

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్ టౌన్/నారాయణపేట/గద్వాల/వనపర్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాను వాన వదలడం లేదు. నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు జల్లులు పడుతూనే ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని మండలాల్లో మోస్తారు వర్షం కురిసింది. కౌకుంట్లలో అత్యధికంగా 29.7, సీసీకుంటలో 28.4, భూత్పూరులో 20, నవాబ్‌పేటలో 18.4, జడ్చర్లలో 17.9, దేవరకద్రలో 17.9, అడ్డాకల్‌లో 17.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

● నాగర్‌కర్నూలు జిల్లా కోడేరు మండలంలో 73.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పెద్దకొత్తపల్లిలో 54.6 మిల్లీమీటర్లు, కల్వకుర్తిలో 43.2, అచ్చంపేటలో 36.0, వంగూరులో 32.0, ఉర్కొండలో 27.4, అమ్రాబాదులో 22.4, తిమ్మాజిపేటలో 22.0, కొల్లాపూర్‌లో 20.4, లింగాలలో 16.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

● నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలో 55.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. మాగనూర్ మండలంలో 54.3, మక్తల్ మండలంలో 20.0, మరికల్ మండలంలో 14.3, గుండుమాల్ మండలంలో 14.0, ధన్వాడ మండలంలో 12.5, కోస్గి మండలంలో 10.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో 55.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెద్దమందడి 52.8, కొత్తకోట 45.6, గోపాల్‌పేట 45.2, వనపర్తి 44.8, అమరచింత 38.4, మదనాపూర్ 34.4, ఆత్మకూరు 28.8, పాన్‌గల్ 28.2, ఘణపూర్ 25.0, పెబ్బేరు 20.6, వీపనగండ్ల 20.2, చిన్నంబావిలో 13.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● జోగుళాంబ గద్వాల జిల్లా కేటిదొడ్డి మండలంలో 31.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మల్దకల్ మండలంఓ 30.7 మిల్లీమీటర్లు, ఇటిక్యాలలో 22.1, గద్వాలలో 21.8, ధరూర్‌లో 17.9, ఎర్రవల్లిలో 16.2, అలంపూర్‌లో 15.9, గట్టులో 15.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

దుందుభీ దాటొద్దు

- తహసీల్దార్ జయంతి



సిర్సవాడ వద్ద దుందుభీ నది వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ జయంతి

తాడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్సవాడ వద్ద దుందుబీ నది ప్రవాహం ఎక్కువగా కొనసాగుతోందని, నది దాటేందుకు ఎవరూ ప్రయత్నించవద్దని తహసీల్దార్ జయంతి అన్నారు. మంగళవారం దుందుభీ నది వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున అలుగులు పారుతూ నది ప్రవాహం పెరిగిందని తెలిపారు. ఎవరూ నది దాటేందుకు ప్రయత్నించి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఎస్ఐ గురుస్వామి, డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్‌అలీ, పంచాయతీ సిబ్బంది, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డుపై ఎక్కి పారుతున్న నీరు

- రాకపోకలకు తీవ్ర అంతరాయం



నీరు పారుతుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం

కందనూలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నాగనూల్ రోడ్డులో కల్వర్టుపై నీరు ఎక్కి పారుతుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి నాగనూల్ చెరువు అలుగు పారగా, ఆ నీరు నాగనూల్ వెళ్లే రోడ్డు కల్వర్టుపై పారుతుండడంతో ద్విచక్ర వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. కొంతమంది యువకులు రోడ్డుపై నిలబడి వాహనదారులను అటు ఇటు పంపిస్తున్నారు. మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనదారుడు రోడ్డు దాటడానికి వెళ్లి అదుపు తప్పి నీటిలో పడిపోయాడు. అక్కడే ఉన్న యువకులు కాపాడి వాహనాన్ని బయటకు తీశారు. స్థానిక ఎస్ఐ గోవర్ధన్, ఇద్దరు పోలీసులను ప్రజారక్షణ కోసం అక్కడ కాపలాగా ఉంచారు. ఏదేమైనా నాగనూల్ వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే.

సిరసనగండ్లలో ఎల్లమ్మ బోనాలు



ఆలయం వద్దకు బోనాలను తీసుకెళ్తున్న మహిళలు, యువతులు

చారకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండంలోని సిరసనగండ్ల గ్రామంలో మంగళవారం ఎల్లమ్మదేవత బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు బోనం కుండలకు పసుపు, కుంకుమ వేపాకులతో అలంకరించి వాయిద్యాల నడుమ భక్తి శ్రద్ధలతో గ్రామంలో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొన్నారు. అక్కడ అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్ర మంలో సురేందర్‌రెడ్డి, శ్రీను, సత్యనారాయణ, హరిచంద్ర, ఈదయ్య, కృష్ణయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

చంద్రసాగర్ - అమ్రాబాద్ ఎత్తిపోతలను తక్షణమే చేపట్టాలి

- ప్రొఫెసర్ జి. హరగోపాల్

బర్కత్‌పుర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు జిల్లాలోని చంద్రసాగర్ - అమ్రాబాద్ ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేపట్టాలని ప్రొఫెసర్ జి. హరగోపాల్ డిమాండ్ చేశారు. పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎత్తిపోతల పథకం చేపడితే అమ్రాబాద్, పదర మండలాల్లోని అన్ని గ్రామాలకు, నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసులు, చెంచులకు తాగునీరు అందుతుందన్నారు. అలాగే 30 వేల ఎకరాలకు సాగు నీరు లభిస్తుందని తెలిపారు. ఈ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలని 40 ఏళ్ళుగా డిమాండ్ చేస్తున్నా, పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చంద్రసాగర్‌కు నీరు వస్తుందని, అక్కడ ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేస్తే, 3 టీఎంసీల నీటితో నల్లమల ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే పాలమూరు జిల్లా పూర్తిగా అభివృద్ధి సాధిస్తుందని భావించామని, కానీ అమ్రాబాద్, అచ్చంపేట, ఆదివాసులు నివసించే ప్రాంతాలు పూర్తిగా వెనకబడి ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలని గత సీఎం కేసీఆర్‌కు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టి పూర్తి చేసి ప్రజల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. పాలమూరు జిల్లాలో 14 మంది ఎమ్మెల్యేలు ఉన్నా, ఏ ఒక్కరూ ఈ పథకం గురించి మాట్లాడడం లేదని విమర్శించారు. ఎత్తిపోతల పథకం చేపట్టాలని ఈ నెల 3 నుంచి 30వ తేదీ వరకు కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలను ప్రొఫెసర్ జి. హరగోపాల్ ఆవిష్కరించారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక ప్రతినిధులు అశ్విని రాజేంద్రబాబు, పీబీ స్వామి, ఆర్ సుధాకర్, రఘుపతిరావు, ఏ. మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ సమస్యలు పరిష్కరించాలి



డోకూర్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

దేవరకద్ర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డోకూర్ దగ్గర ఏర్పాటు చేసిన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి సమస్యను పరిష్క రించాలని గ్రామస్థులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ అండర్‌పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. కానీ వర్షపు నీరు బ్రిడ్జి కింద నిలిచి రాకపోకలను ఇబ్బందిగా మా రిందని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డి మాండ్ చేశారు.

కుడి ఎడమైతే.. పొరపాటు లేదోయ్...

- ఎడమ చేయి వాటంతో ఇబ్బంది లేదు
- అభిప్రాయ పడుతున్న లెఫ్ట్ హ్యాండర్స్
- వారికీ ఓ ప్రత్యేక దినోత్సవం

నారాయణపేట/ మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కుడి, ఎడమ ఏ చేయి అయితే నేం.. మాకేమీ ఇబ్బంది లేదు అంటున్నారు ఎడమ చేతి వాటం అలవాటున్న వారు. సాధారణంగా కుడి చేయి శుభ్రపదమని ప్రజల భావన. దేవుడికి హారతి ఇవ్వాలన్నా, ఎవరికైనా డబ్బు ఇవ్వాలన్నా కుడి చేయి తోనే ఇవ్వాలని చెప్తుంటారు. కానీ కొందరికి ఎడమ చేతి వాటం ఉంటుంది. ఏ పనైనా ఎడమ చేతితోనే చేస్తుంటారు.

అందుకు తోటి వారు, కుటుంబ సభ్యులు అభ్యంతరం చెప్తుంటారు. ఎడమ చేతి వాటం అంటూ స్నేహితులు గేలి చేస్తుంటారు. అయితే రెండు చేతులు తమవేనని, ఏ చేయి అయితేనేం.. మాకు ఇబ్బంది లేనప్పుడు, మీకెందుకు అభ్యంతరం అని వారు సమాధానం చెప్తుంటారు. వీరు ఎడమ చేయితో రాయడంతో పాటు ఇతర పనులను కూడా చేస్తుంటారు. అలాంటి వారికోసం ప్రపంచ వ్యాప్తంగా ఓ ప్రత్యేక దినోత్సవాన్ని కూడా నిర్వహిస్తున్నారు. అదే 'లెఫ్ట్ హ్యాండర్స్ డే'. ప్రతి సంవత్సరం ఆగస్టు 13న దీనిని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కొందరు లెఫ్ట్ హ్యాండర్స్‌ను 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. వారి అభిప్రాయాలు...




ఎలాంటి ఇబ్బందీ లేదు

చిన్నప్పటి నుంచి ఎడమచేతిలోనే రాస్తున్నాను. ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయితే వేగంగా రాయాలంటే మాత్రం కొంత ఇబ్బంది అవుతుంది. కేజీ నుంచి పీజీ వరకు ఎడమ చేతితోనే పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాను. ప్రస్తుతం మైనార్టీ గురుకులాల రీజినల్ లెవెల్ కోఆర్డినేటర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ పని చేస్తున్నాను.

– సయ్యద్ రజీయోద్దీన్, జూనియర్ అసిస్టెంట్



చిన్నప్పటి నుంచి అంతే



మాది నారాయణపేట పట్టణంలోని పళ్ల ప్రాంతం. నేను చిన్నప్పటి నుంచే ఎడమ చేతితోనే రాస్తున్నా. ఈ చేయితోనే పరీక్షలు రాసి డిగ్రీ పూర్తి చేశాను. ప్రస్తుతం జిల్లా జనరల్ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాను. ఎడమచేతి వాటంతో నాకు ఎలాంటి ఇబ్బందీ లేదు.

– రాము, నారాయణపేట

లెఫ్ట్ హ్యాండ్ బ్యాటింగ్

నేను క్రికెట్ ప్లేయర్‌ను. ప్రస్తుతం నారాయణపేటలోని ఓ ప్రైవేట్ కళా శాలలో ఇంటర్మీడియట్ చదువుతు న్నాను. చిన్నప్పటి నుంచి ఎడమ చేతితోనే రాస్తున్నాను. అలాగే క్రికెట్‌లో బ్యాటింగ్, బౌలింగ్ కూడా ఎడమ చేతితోనే చేస్తాను. గత ఏడాది జాగృతి ఫౌండేషన్ నిర్వహించిన క్రికెట్ పోటీ ల్లో జడ్పీహెచ్ఎస్ కోటకొండ జట్టు తరఫున కెప్టెన్ ప్రభునాయక్ ఆధ్వర్యంలో పాల్గొన్నాను. ప్రథమ బహుమతిని అందుకున్నారు.



– ఏ. ప్రభునాయక్, మేకహనుమాన్ తండా

కుడి చేయి పనిచేయకపోవడంతో..



నేను 5వ తరగతి వరకు కుడి చేతితోనే రాసే వాడిని. పీర్ల పండుగ సమయంలో ఊట్కూరు మ సీదు వద్ద తోపులాటలో గుంతలో పడిపోవడంతో కుడి చేయి విరిగింది. ఆ చేయి పనిచేయకపోవడంతో ఎడమ చేతితో రాయడం సాధన చేశాను. మా నాన్న బక్తుల వెంకట నారాయణ కూడా ఎడ మ చేతితోనే రాసేవారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఇంటర్ పూర్తి చేశాను. ప్రస్తుతం వ్యాపారం చేస్తున్నాను.

– బక్తుల సంతోష్, చిరు వ్యాపారి, నారాయణపేట

క్రైం కార్నర్

కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం

బ్రహ్మగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులోని కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు నాగర్‌కర్నూల్ జిల్లా, బ్రహ్మగిరి ఎస్‌ఐ జయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమ్రాబాద్ మండలంలోని ఎదమ పాతాళగంగ పుష్కరఘాట్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడి వయసు 40 నుంచి 45 సంవత్సరాలు ఉండొచ్చు. అతడి వంటిపై బ్లూ కలర్ డ్రాయర్, జేబులో హోండా షైన్ తాళం చెవి ఉందని ఎస్‌ఐ తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడతామని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


ఖాధర్ (ఫైల్)

ఊట్కూర్, అగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆవు పొడవడంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన ఖాధర్ (50)కు మతిస్థిమితం లేదు. ఊర్లో అటు ఇటూ తిరుగుతుండేవాడు. ఇటీవల మగ్దుంపురం చౌరస్తా వద్ద అతడిని పొడిచింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఖాధర్‌ను స్థానికులు అసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. అతడి అన్న అబ్దుల్ రహిమాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జారి కింద పడి వ్యక్తి మృతి


వెంకటయ్య (ఫైల్)

గోపాల్‌పేట, (ఏదుల) ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కాలు జారి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండల కేంద్రంలో జరిగింది. ఎస్‌ఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏదులకు చెందిన ద్వావరి వెంకటయ్య సోమవారం మధ్యాహం అదే గ్రామానికి చెందిన కొమ్ము వెంకటయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై గోపాల్‌పేట మండల కేంద్రంలో జరిగిన ఓ శుభకార్యానికి వచ్చారు. భోజనం చేసిన తర్వాత వెంకటయ్య చేతులు కడుగుకొనేందుకు వెళ్లి కాలుజారి కిందపడి అపస్మారక స్థితిలో పడిపోయాడు. పక్కనున్న వారు ఆయనను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. సంఘటనపై మృతుడి భార్య అలివేల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాముకాటుతో బాలిక మృతి


గౌతమి (ఫైల్)

మూసాపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలంలోని నందిపేటలో పాముకాటుకు గురై ఓ బాలిక మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దొడ్ల ఆంజనేయులు కుమార్తె గౌతమి(8) సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటే వేసింది. మంగళవారం ఉదయం బాలిక వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు దేవరకద్ర అసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండ టంతో 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా అసుపత్రికి తరలిస్తుండ గా, మార్గంమధ్యలో మృతి చెందింది. బాలిక గ్రామంలోని పాఠశాలలో నా లుగవ తరగతి చదువుతోంది.

విద్యుదాఘాతంతో నాలుగు ఆవులు మృతి


విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన పశువులు

కోడేరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల పరిధిలోని బాడుగదిన్నెలో విద్యుదాఘాతంతో నాలుగు పశువులు చనిపోయాయి. గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి గ్రామ శివారులో విద్యుత్ తీగలు తెగి కిందపడ్డాయి. మంగళవారం ఉదయం గ్రామానికి బైరబోవు చిన్న బొజ్జన్న, మొలకల లోకేశ్వరిలకు చెందిన ఆవులు మేతకు వెళ్లాయి. అక్కడ విద్యుత్ తీగలకు తగిలి నాలుగు ఆవులు మృతి చెందాయి. వాటి విలువ విలువ రూ.5 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

» ఒక్కొక్కరికి రూ.2లక్షల జరిమానా

ఖమ్మం లీగల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గంజాయిని తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయాధికారి కె.ఉమాదేవి మంగళవారం తీర్పు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా, గద్వాలకు చెందిన మహేశ్ అలియాస్ నాయక్ మల్లేశ్, జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన గడ్డం బువన్‌లు జల్సాలకు అలవాటు పడ్డారు. అక్రమార్జన కోసం 2021, ఏప్రిల్ 28న మోతుగూడెం నుంచి రూ.30 లక్షల విలువైన 200 కిలోల గంజాయి కొనుగోలు చేసి కారులో తీసుకొస్తున్నారు. దారిలో ఖమ్మం సమీపంలోని వి.వెంకటాయ పాలెం వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఉండటంతో కారును వేగంగా నడుపుతూ, ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ఢీ కొట్టారు. దీంతో రెండు వాహనాలూ బోల్తాపడ్డాయి. ఆటోలోని ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం కారును పరిశీలించగా 200 కిలోలున్న 100 గంజాయి ప్యాకెట్లు లభించాయి. పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులో తీసుకున్నారు. మరో నిందితుడు హైదరాబాద్ దిండిగల్‌కు చెందిన ఇషాక్ పరారీలో ఉన్నాడు. పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ అనంతరం నేరం రుజుకు కావడంతో దోషులకు జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి పైవిధంగా తీర్పు వెల్లడించారు.

7వ తరగతి విద్యార్థి అదృశ్యం


శివశంకర్ (ఫైల్)


మూసాపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉండే 7వ తరగతి విద్యార్థి శివశంకర్ (14) మంగళవారం సాయంత్రం అదృశ్యం అయ్యాడు. ఉదయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లిన విద్యార్థి 12:30 గంటలకు కాలకృత్యాలకని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం వరకు కూడా హస్టల్‌కు కూడా రాలేదు. దీంతో వార్డెన్ ఆనంద్‌జీ కుటుంబ సభ్యులను ఆరా తీయగా, ఇంటికి కూడా రాలేదని వారు తెలిపారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. విద్యార్థి ఆచూకీ తెలిసిన వారు వార్డెన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి

గండీడ్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రత్యేకాధికారి సంజీవ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సల్కర్‌పేట్ గిరిజన మినీ గురుకుల, మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. భవనాల్లో ఉన్న సమస్యలను విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తామన్నారు. కూరగాయాలు ఎప్పటికప్పుడు తీసుకరావాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో హరిశ్చంద్రారెడ్డి, ఇన్‌జార్జి ఎంఈవో జనార్దన్ పాల్గొన్నారు.

ఒకరి మరణం.. మరికొందరికి జీవితం

» అవయవదానంతో ఇతరులకు ప్రాణదానం
» ముందుకొస్తున్న బాధిత కుటుంబ సభ్యులు
» నేడు జాతీయ అవయవదాన దినోత్సవం



భూత్పూర్/ గద్వాల క్రైం/ జడ్చర్ల/ అయిజ/ ఖిల్లాఘణపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : పుట్టుకకు.. చావుకు మధ్యనున్నదే మనిషి జీవితం.. కానీ మరణించిన తర్వాత మరికొందరిలో జీవించి ఉండవచ్చు. వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపవచ్చు. అది అవయవదానంతో సాధ్యం అవుతుంది. సాధారణంగా ఏదైనా ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన వారి అవయవాలతో ఇతరులకు ప్రాణదానం చేయవచ్చు. వారి మూత్రపిండాలు, లివర్, గుండె, గుండె కవాటాలు, పేగులు, క్లోమం, కార్నియా, ఊపిరితిత్తులను సేకరించి అవసరమున్న వారి శరీరాల్లో అమరుస్తారు. అలాగే జీవించి ఉన్న వారు కూడా మూత్రపిండం, ఎముకల్లోని మూలుగ, కాలేయంలో కొంత భాగాన్ని దానం చేయవచ్చు. తద్వారా బాధితులకు ప్రాణదానం చేసిన వారం అవుతాం. ఇలా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలువురు అవయవాలను దానం చేసి ఇతరులకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. నేడు జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

మరణంలేని మహా నాయకుడు


ఉత్తనూరు తిర్మల్‌రెడ్డి

ప్రజాసేవే లక్ష్యంగా జీవితాంతం కృషి చేసిన మా నాన్న తిర్మల్‌రెడ్డికి మరణం లేదని, అవయవదానం ద్వారా ఆయన జీవించే ఉన్నారని ఆయన కుమారుడు గౌతమ్ రెడ్డి తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండలంలోని ఉత్తనూర్ గ్రామానికి చెందిన పులకుర్తి తిర్మల్‌రెడ్డి సింగిల్‌విండో చైర్మన్‌గా రాజకీయ రంగప్రవేశం చేశారు. 2 సార్లు ఎంపీపీ, ఒక సారి జడ్పీటీసీగా పని చేశారు. ఆయన 22 మార్చి 2022న మరణించారు. ఆయన కళ్ళు, కిడ్నీలు, లివర్ దానం చేసి ఇతరులకు కొత్త జీవితాన్ని అందించడం తనకు గర్వకారణమని గౌతమ్ రెడ్డి తెలిపారు. ఆయన ఆశయ సాధనకు అహర్నిశలు కృషి చేస్తామన్నారు.



\- కుమారుడు గౌతమ్‌రెడ్డి

నేత్రదానంతో ఇతరులకు కంటి చూపు


శివకుమార్


కొండ బాలయ్య

నేత్రదానం ఆవశ్యకత, ప్రాధాన్యంపై యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. దీంతో పలువురు నేత్రదానానికి ముందుకొస్తున్నారు. వనపర్తి జిల్లా, ఖిల్లా ఘణపురం మండలంలోని షాపూర్ గ్రామానికి చెందిన శివ కుమార్ 2024 ఫిబ్రవరి 16 న విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులు అతడి కళ్లను కుటుంబ సభ్యులు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి అందజేశారు. వెంకటాం పల్లి గ్రామా నికి చెందిన కొండ బాలయ్య గత ఏడాది నవంబర్ 4న పా ము కాటుతో మృతి చెందాడు. అతడి కళ్లను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. తన సోదరుడి కళ్లతో ఇతరులకు కం టి చూపు ప్రసాదించడం ఆనందం కలిగించిందని అతడి తమ్ముడు రామస్వామి తెలిపారు.

ఎనిమిది మందికి ప్రాణదానం


నాగేంద్ర

మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర నియోజవర్గంలోని కౌకుంట్ల మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాగేంద్ర 2022, డిసెంబరు 12న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బ్రెయిన్‌డెడ్ అయ్యింది. ఈ సందర్భంగా వైద్యుల సూచన మేరకు అవయవదానానికి అతడి కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఊపితిత్తులు, కళ్లు, మూత్రపిండాలు, గుండె, కాలేయం తదితర అవయవాలను వైద్యులు సేకరించి, వాటితో 8 మందికి అమర్చారు.

ఆదర్శప్రాయం.. 'చరిత' కుటుంబం


చరిత

ప్రసవం అనంతరం ఆమె అనారోగ్యంతో బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యింది. ఆమె అవయవాలను దానం చేసేందుకు పుట్టెడు దుఃఖంలోనూ కుటుంబ సభ్యులు ముందుకొచ్చి ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలిచారు. గద్వాల పట్టణానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి శ్రీధర్ భార్య అయిన చరిత 2022, జూన్ 6న కుమారుడికి జన్మనిచ్చింది. ఆ తర్వాత 23 రోజులకు తీవ్రమైన తలనొప్పి రావడంతో కర్నూల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతుండగా బ్రెయిన్‌డెడ్ అయ్యింది. వైద్యుల సూచన మేరకు ఆమె గుండె, కళ్లు, కిడ్నీలను ఇచ్చి, నలుగురికి ప్రాణదానం చేశారు.

మా కుమారుడికి మరణం లేదు


శ్రీప్రసాద్

తమ కుమారుడికి మరణం లేదని, అతడి అవయవాలతో మరో నలుగురికి కొత్త జీవితం లభించిందని మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని బూర్గుపల్లికి చెందిన కావలి నరసింహ, మహాలక్ష్మి అభిప్రాయపడ్డారు. వారి కుమారుడు, న్యాయవిద్యార్థి కావలి శివప్రసాద్ (22) ఈ ఏడాది జూన్ 17న ఓ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 27న బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యాడు. వైద్యుల సూచన మేరకు అతడి రెండు కిడ్నీలు, లివర్, ఊపిరితిత్తులను దానం చేశారు. తమ కుమారుడి అవయవాలతో మరో నలుగురికి మేలు జరిగిందని తల్లిదండ్రులు తెలిపారు.

\- తల్లిదండ్రులు నరసింహ, మహాలక్ష్మి, బూర్గుపల్లి

నా భార్య కళ్లతో ఇద్దరికి చూపు


భాగ్యమ్మ

అనారోగ్యంతో మృతి చెందిన తన భార్య భాగ్యమ్మ(65) కళ్లను దానం చేసి మరో ఇద్దరికి దృష్టి భాగ్యం కలిగించడం ద్వారా మనశ్శాంతి లభించిందని జడ్చర్ల పట్టణానికి చెందిన అచ్యుతారెడ్డి అన్నారు. భాగ్యమ్మ గత ఏడాది నవంబర్ 29న అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె నేత్రాలను దానం చేస్తే మరొకరికి కంటిచూపు ప్రసాదించిన వాళ్లం అవుతామని లయన్స్‌క్లబ్ సభ్యులు అవగాహన కల్పించారు. దీంతో భాగ్యమ్మ కళ్లను హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖానాకు దానం చేసినట్లు అచ్యుతారెడ్డి తెలిపారు.

\- భర్త అచ్యుతారెడ్డి, జడ్చర్ల

ఇద్దరికి చూపునివ్వడం సంతోషం కలిగించింది


వెంకటేశ్‌గౌడ్

తన భర్త కళ్లతో ఇతరులకు చూపునివ్వడం తనకు సంతోషం కలిగించిందని మాజీ అడిషనల్ పి.పి. వెంకటేశ్‌గౌడు సతీమణి వరలక్ష్మి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన వెంకటేశ్ గౌడ్ 2022, ఏప్రిల్ 13న గుండె పోటుతో మృతి చెందాడు. అంత బాధలోనూ వరలక్ష్మి తన భర్త కళ్లను దానం చేసేందుకు కుటుంబ సభ్యులను ఒప్పించింది. కర్నూల్ లయన్స్ క్లబ్ సహకారంతో వైద్యనిపుణులు వెంకటేశ్‌గౌడ్ కళ్లను సేకరించారు. వరలక్ష్మి ప్రస్తుతం ఏజీపీ (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

\- భార్య వరలక్ష్మి, ఏజీపీ, గద్వాల

పేదల కోసమే క్రిటికల్ కేర్ సెంటర్

» మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి వైద్యవిభాగం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పేదలకు మెరుగైన వైద్యం సేవలందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రిటికల్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని క్రిటికల్ కేర్ సెంటర్, ఆధునిక పరికరాలు, టీ హబ్ సెంటర్, ఎంసీహెచ్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 17 కోట్ల వ్యయంతో క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇక్కడ ఒకేసారి 50 మందికి అత్యవసర వైద్య సేవలు అందుతాయని తెలిపారు. 25 మందికి ఐసీయూ బెడ్స్‌తో మెరుగైన చికిత్స అందించేలా తాను మంత్రిగా ఉన్నప్పుడే కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు రూ. 2.40 కోట్ల వ్యయంతో సీటీ స్కాన్ సేవలు, 135 రకాల వైద్య పరీక్షల కోసం టీహబ్‌ను మంజూరు చేసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం అక్కడ దాదాపు 40 వరకు పరీక్షలు నిర్వహించడం లేదన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కొరవడిన వసతులు, వైద్య సేవలపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి లేఖ రాస్తానని తెలిపారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లపై ముఖ్యమంత్రి ఫోటో ముద్రించుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. నియోజకవర్గంలో 9 అంబులెన్స్‌లను సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా, వ్యక్తిగత సొమ్ముతో, శ్రేయోభిలాషులు, స్నేహితులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, రమేశ్‌గౌడ్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, ఉంగ్లం తిరుమల్, నాగన్న యాదవ్, హేమంత్, చిట్యాల రాము, సూగుర్ రాము, గులాం ఖాదర్, నీలస్వామి, భాగ్యరాజ్, తోట శ్రీను ఉన్నారు.

ఆర్టీసీకి 'శ్రావణ' లాభం

» రూ.16.15 కోట్ల ఆదాయం

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు శ్రావణమాసం లాభాలు తెచ్చిపెట్టింది. సంస్థకు ఉమ్మడి జిల్లాలోని పది డిపోలు రూ.16.15 కోట్ల లాభాలను ఆర్జించినట్లు ఆర్ఎం సంతోష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుంచి 11 వరకు వరుస సెలవులు వచ్చాయని పేర్కొన్నారు. అందులో వరలక్ష్మీ వ్రతాలు, రాఖీ పర్వదినం కూడా ఉండడంతో ఉమ్మడి జిల్లాలోని 10 డిపోల పరిధిలో ప్రజలు, ఎక్కువ సంఖ్యలో మహిళలు బస్సుల్లో ప్రయాణించారని తెలిపారు. ఈ ఐదు రోజుల్లో ఆర్టీసీ 19.5 లక్షల కిలోమీటర్ల బస్సు సర్వీసులు నడిపిందని తెలిపారు. మొత్తంగా 26.63 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చామని పేర్కొన్నారు. గత సంవత్సరం కన్నా 15 వేల మంది ప్రయాణికులు అధికమని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 139 శాతం ఓఆర్‌తో మహబూబ్‌నగర్ రీజియన్ మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఈ అద్భుత విజయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ రీజియన్ లోని ప్రతీ ఉద్యోగి కృషి ఉందని కొనియాడారు. ప్రధానంగా మహిళా ఉద్యోగులు వరలక్ష్మి వ్రతం, రాఖీ పండుగ రోజుల్లోనూ విధులకు హాజరుకావడం గర్వకారణమని పేర్కొన్నారు. రీజియన్‌ను మొదటి స్థానంలో నిలిపినందుకు ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులను అభినందించారు.

19న జములమ్మ కల్యాణం

» పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే దంపతులు


కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నడిగడ్డ ఇలవేలుపు అయిన జములమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో కళ్యాణ మహోత్సవ పోస్టర్‌ను మంగళవారం సతీమణి బండ్ల జ్యోతితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వాట్సాప్ వీడియోను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 18న జమ్మిచేడులోని అంజనేయస్వామి దేవాలయంలో ఎదుర్కోళ్లు, 19న కళ్యాణ మహోత్సవం, 20న ధ్వజారోహనం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్వ హనుమంతు, ఆలయ కమిటీ చైర్మన్ బోయ వెంకట్రాములు, ఈవో పురేందర్, డైరెక్టర్లు రాధాకృష్ణారెడ్డి, మధుమతి, చంద్రశేఖర్, అక్కల శ్రీనివాసులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కర్రీపఫ్‌లో పాము పిల్ల


జడ్చర్ల పట్టణంలోని బేకరీలో పాముపిల్ల ఉన్న కర్రీపఫ్

జడ్చర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : తింటున్న కర్రీపఫ్‌లో పాముపిల్ల కనిపించడంతో ఓ మహిళ ఆందోళనకు గురైన సంఘటన మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో చోటుచేసుకున్నది. జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని ఓ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీశైల అనే మహిళ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీలక్ష్మి బెంగళూరు బేకరీ అండ్ స్వీట్స్ దుకాణంలో కర్రీపఫ్‌లు కొనుగోలు చేసింది. కొనుగోలు చేసిన కర్రీపఫ్‌ను ఇంటికి తీసుకెళ్లి తింటుండగా అందులో పాము పిల్ల కనిపించింది. దీంతో ఆందోళనకు గురైన ఆమె తన ఇంటి చుట్టుపక్కల వారితో కలిసి వచ్చి ఇదేంటని బేకరీ యజమాన్యాన్ని ప్రశ్నించింది. అనంతరం స్థానిక ప్రజాసంఘాల నాయకుడు తెలుగుసత్తయ్య ఆధ్వర్యంలో జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రమాదం లేదన్నారు.

పొంగిపొరలిన వాగు.. గర్భిణికి అవస్థలు


కర్ని వద్ద పారుతున్న వాగు నీటిలో రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రజలు


అలుగు దాటిన తర్వాత ట్రాక్టర్‌పై నుంచి గర్భిణిని కిందికి దించుతున్న కుటుంబ సభ్యులు

మక్తల్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సమీపంలోని వాగు పొంగి పొరలుతుండటంతో ఓ గర్భిణిని ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు కుటుంబసభ్యులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మక్తల్ మండలంలో ఈ సంఘటన జరిగింది. మండలంలోని కర్ని, చిట్యాల, ముస్లాయిపల్లి గ్రామాల మధ్యనున్న వాగు ప్రధాన రహదారిపై కల్వర్టుల వద్ద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. మండలంలోని చిట్యాలకు చెందిన గర్భిణి పద్మను కాన్పు కోసం కుటుంబ సభ్యులు మంగళవారం మక్తల్ ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. అంబులెన్స్ కానీ, ఆటో కానీ వాగు దాటి వెళ్లే పరిస్థితి లేకపోవంతో గ్రామం నుంచి ట్రాక్టర్లో వచ్చారు. వాగు దాటిన తర్వాత 108 అంబులెన్సులో మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అలాగే పొరుగు రాష్ట్రాల నుంచి వల్లభాపురం శ్రీదత్తపీఠం, కురువపురం క్షేత్రాలకు వచ్చి వెళ్లేవారు కూడా ఇబ్బంది పడ్డారు. కల్వర్టు ఎత్తి పెంచాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఎరువుల కొరత లేకుండా చూస్తున్నాం

● పీఏసీఎస్ సీఈవో కృష్ణ



మరికల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు, క్రిమిసంహారక మందుల కొరత లేకుండా పీఏసీఎస్ ద్వారా అతి తక్కువ ధరకు అందిస్తున్నామని పీఏసీఎస్ సీఈవో కృష్ణ తెలిపారు. రైతులు పీఏసీఎస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన కోరారు.

పీఏసీఎస్ ద్వారా ఎంత మంది రైతులకు రుణాలిచ్చారు?

పీఏసీఎస్ ద్వారా 400 మందికి గాను రూ.2 కోట్లు రుణాలు అందజేశాం.

రైతులకు కొత్త రుణాలు ఇస్తున్నారా?

ప్రస్తుతం పీఏసీఎస్ ద్వారా కొత్త రుణాలు ఇవ్వడం లేదు. కేవలం పాత రుణాలను రెన్యూవల్ చేస్తున్నాం.

పీఏసీఎస్‌లో ఎంత మంది సభ్యత్వం తీసుకున్నారు?

కొత్త సభ్యత్వాలు తీసుకోవడం లేదు. రుణాలు ఇచ్చే ముందు సభ్యత్వం చేయించుకుంటున్నాం.

ఎరువులు అందుబాటులో ఉన్నాయా?

ప్రస్తుతం ఎరువుల కొరత లేకుండా అందిస్తున్నాం.

రైతులకు ఎన్ని బస్తాల ఎరువులు అందజేస్తున్నారు?

చిన్న రైతులకు రెండు బస్తాలు, పెద్ద రైతుకు ఐదు బస్తాలు అందిస్తున్నాం.

న్యూస్ బాక్స్

సంగంబండ రిజర్వాయర్ గేటు ఎత్తి నీటి విడుదల

మక్తల్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం గేటు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి పెద్ద వాగు వరద ఎక్కువగా వస్తుండడంతో మంగళవారం గేటు ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేశారు. జలాశయానికి 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అంతే మేర ఔట్‌ఫ్లో ఉందని, రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.5 టీఎంసీలు ఉందని ఇరిగేషన్ డీఈ సురేష్ తెలిపారు.

కల్యాణలక్ష్మి దరఖాస్తుల పరిశీలన

కోస్గి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కోస్గి మండల కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను తహసీల్దార్ బక్క శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. మండల పరిధిలో ఈ పథకాలకు దరఖాస్తు చేసుకున్న 14 మంది లబ్ధిదారుల్లో 10 మంది లబ్ధిదారులను తహసీల్దార్ తన చాంబర్‌లో క్రాస్ ఎగ్జామిన్ చేశారు. దరఖాస్తులో పొందుపరచిన వివరాలు వాస్తవంగా ఉన్నాయన్నారు.

పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

నారాయణపేటరూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాజాపూర్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో బాలాజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. వంటపాత్రలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మెనూ ప్రకారం భోజనం వండాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. హెచ్‌ఎం పద్మ, ఎమ్మార్సీ నారాయణ, విశ్వనాథ్ తదితరులున్నారు.

పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

నారాయణపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం నారాయణపేట పురపాలక సంఘంలో పారిశుధ్య కార్మికులకు, కార్యాలయ ఉద్యోగులందరికీ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన యశోద ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులకు, ఉద్యోగులకు కంటి పరీక్ష, షుగర్, బీపీ, ఈసీజీ, గుండె పరీక్షలు చేశారు. అనంతరం కార్మికుల ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్‌తో పాటు కార్యాలయ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యసాయి శత జయంతి ఉత్సవాలు

నారాయణపేటరూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్స్‌లో బుధవారం సత్యసాయి శత జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ చిట్టెం మాధవరెడ్డి మంగళవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నిస్వార్థ సేవలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు జరిగే ఈ సదస్సులో విద్యార్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

అసంపూర్తిగా పంచాయతీ భవనాలు



వాల్యానాయక్ తండాలో శ్లాబ్‌కే పరిమితమైన గ్రామ పంచాయతీ భవనం

- శ్లాబ్‌ల వరకు మాత్రమే పూర్తయిన నిర్మాణాలు
- పాఠశాలల్లో రికార్డులు భద్రపరుస్తున్న కార్యదర్శులు



భూనీడు గ్రామంలో ఇలా..

కొత్తపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏళ్లు గడిచినా పూర్తి కావడం లేదు. భూనీడు, వాల్యానాయక్ తండాలో సొంత భవనాలు లేక కార్యదర్శులు, కార్మికులు, గ్రామ స్థాయి అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటివరకు మండలంలోని పలు గ్రామాల్లో శ్లాబ్ వరకు నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. రికార్డులను అంగన్‌వాడీ కేంద్రాల్లో భద్రపర్చుకొని విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం ఒక్కో భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేసి సర్పంచ్‌లకు అప్పగించింది. తర్వాత వారి పదవీకాలం ముగియడంతో నిర్మాణాలను పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రస్తుతం అధికారులు గ్రామాల్లో ఏదైనా సమావేశం నిర్వహించాలంటే పాఠశాల నుంచి అనుమతి తీసుకొని ఆవరణల్లో నిర్వహిస్తున్నారు. సిబ్బందికి మాత్రం రికార్డుల నిర్వహణ, వాటి భద్రతకు తిప్పలు తప్పడం లేదని వాపోతున్నారు.

పేదల మనసులో చిరస్థాయిగా నిలిచారు

- ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు
- ఎర్రసత్యంకు సంఘం నాయకుల ఘన నివాళి



దామరగిద్దలో ఎర్రసత్యం చిత్రపటం ముందు నివాళి అర్పిస్తున్న ముదిరాజ్‌లు

నారాయణపేట/మరికల్/దామరగిద్ద/ఊట్కూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆశాజ్యోతిగా వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తు వారి మనసుల్లో ఎర్రసత్యం చిరస్థాయిగా నిలిచిపోయారని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు అన్నారు. జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం వర్ధంతి సందర్భంగా మంగళవారం పేట పట్టణంలోని సత్యనారాయణ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి ముదిరాజ్ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎర్రసత్యం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అఖిల భారత అయ్యప్ప ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ కాకర్ల భీమయ్య, సంఘం పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య, ఆర్టీఏ డైరెక్టర్ పోషల్ రాజు, టీడీపీ నాయకులు ఓంప్రకాష్, బాపిరెడ్డిపల్లి రాము, పల్ల వెంకట్‌రాములు, పోలేముని కృష్ణ, మారుతి, వకీల్ ప్రశాంత్, కుంటిమారి అశోక్, సంతోష్, సతీష్, బోపుల రాజు, నారాయణ, గోపి, పళ్ల రఘు, బొంబాయి బాలాజీ, యాబన్నచౌదరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదేవిధంగా, మరికల్ మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తాతో పాటు, పెద్దచింతకుంట గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ముందు ఎర్రసత్యం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు, ప్రజలు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు, అభివృద్ధి పనులను గుర్తు చేశారు. కార్యక్రమంలో సూర్యమోహన్‌రెడ్డి, నారాయణ, రామస్వామి, రాఘవేందర్, ఆంజనేయులు, ముదిరాజ్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

దామరగిద్దలో ముదిరాజ్‌లు ఎర్రసత్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మొగులప్ప, ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, ఉపాధ్యక్షుడు జల్లప్ప, మాజీ సర్పంచ్ తిప్పన్న, చంద్రకాంత్, వెంకట్రాములు, ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

ఊట్కూర్ మండలం మల్లేపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఎర్రసత్యం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కథలప్ప, అంజప్ప, వెంకటేష్, లక్ష్మణ్, మల్లేష్, బాలరాజ్ తదితరులున్నారు.



నారాయణపేటలో ఎర్రసత్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రాజీవ్ స్ఫూర్తితో దేశ ఐక్యతకు పాటుపడదాం

- డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



పేటలో రాజీవ్‌గాంధీ సద్భావన జ్యోతి యాత్రకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నారాయణపేట/కృష్ణ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మత సామరస్యం, అభివృద్ధి పట్ల అవగాహన పెంచుతూ దేశ ఐక్యత కోసం పాటుపడదామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం కర్ణాటక రాష్ట్రం నుంచి బయలుదేరిన రాజీవ్‌గాంధీ సద్భావన జ్యోతి యాత్ర కృష్ణ మండలం గుడెబల్లూరు గ్రామ శివారులోని చెక్‌పోస్టు కృష్ణానది వంతెన వద్ద నారాయణపేట జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు జ్యోతి యాత్రకు సింగారం గేట్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ సమాజంలో మత సామరస్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా కృషి చేస్తోందన్నారు. కుల మతాలకతీతంగా దేశ ప్రజల్లో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించడం యాత్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం యాత్రను తెలంగాణ సరిహద్దు జిలాల్‌పూర్ గ్రామం వరకు నిర్వహించి కర్ణాటక రాష్ట్రానికి సాగనంపారు. రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర జాతీయ అధ్యక్షుడు దొరై, కన్వీనర్ సుజేంద్రశెట్టి, అధ్యక్షుడు శ్రీనివాసయ్య, పట్టణ అధ్యక్షుడు ఎండీ.సలీం, నాయకులు మనోహర్‌ప్రసాద్‌గౌడ్, ధన్వాడ మండల అధ్యక్షుడు నరహరిముదిరాజ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహిమూద్ ఖురేషి, పీఏసీఎస్ డైరెక్టర్ మల్లేష్, యూసుఫ్‌తాజ్, పళ్ల అనిల్, ఎరుకలి వెంకటయ్య, బాపనపల్లి అంజి, మారెప్ప, రవికిరణ్ తదితరులున్నారు.

నేడు టీఎల్ఎం మేళా సన్నాహక సమావేశం

మాగనూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం నిర్వహించే టీఎల్ఎం మేళాను విజయవంతం చేయాలని ఎంఈవో మురళీధర్‌రెడ్డి, టీఎల్ఎం ఇన్‌చార్జి తమ్మన్న కోరారు. మంగళవారం మాగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడారు. టీఎల్ఎం కార్యక్రమంలో పాల్గొనే హెచ్‌ఎంలకు సూచనలు, సలహాలు చేశారు. ప్రతీ పాఠశాల నుంచి విద్యార్థులకు అవగాహన కలిగే విధంగా మెటీరియల్ సమకూర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బలరాం, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

నారాయణపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈనెల 14న స్థానిక శ్రీసత్యనారాయణ కమాన్ దగ్గర ఉన్న ఉప విద్యుత్ కేంద్రంలో పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరిష్కార వేదిక ఉంటుందని, అవకాశాన్ని మక్తల్, కోస్గి, నారాయణపేట సబ్ డివిజన్ పరిధిలోని వినియోగదారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

18 నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్ల రెండో బ్యాచ్ శిక్షణ

నారాయణపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లాలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల రెండో బ్యాచ్ శిక్షణను ఈనెల 18 నుంచి నిర్వహించనున్నామని కలెక్టర్ సిక్తా పట్నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, సర్వే అధికారి గిరిధర్ మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు ఒక జిరాక్స్ సెట్, ప్రభుత్వ సివిల్ సర్జన్ ద్వారా ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో జిల్లా కేంద్ర సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణకు ఈనెల 18న ఉదయం 11 గంటల వరకు చేరుకోవాలని గిరిధర్ తెలిపారు.

వాహనాలకు నెంబర్ ప్లేట్లు తప్పనిసరి



మాగనూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ అశోక్‌బాబు

నారాయణపేటరూరల్/మాగనూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం రహదారి భద్రత, నేరాల నివారణ దృష్ట్యా ప్రతీ వాహనానికి నెంబరు ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని ఏఎస్ఐ అంజనేయులు అన్నారు. మంగళవారం పేట మండలం సింగారం చౌరస్తా సమీపంలో వాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధిస్తూ అవగాహన కల్పించారు. వాహనదారులు తమ వాహనాలకు నెంబరు ప్లేట్లు ఉంచుకోవాలన్నారు. నెంబర్‌ను స్పష్టంగా కనిపించేలా ఉంచాలని, లేకపోతే వాహన చట్టం ప్రకారం చర్యలు తప్పవన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. పోలీసులు నర్సింహా, సుధాకర్ తదితరులున్నారు.

అదేవిధంగా, మాగనూరులోని 167వ జాతీయ రహదారిపై ఎస్ఐ అశోక్‌బాబు పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. అలాగే, వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ వంటి సర్టిఫికెట్లను వెంట ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

యూరియా కోసం పడిగాపులు

నర్వ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆలస్యంగా కురుస్తున్న వర్షాలతో ఆందోళన చెందుతున్న రైతులకు యూరియా బస్తాలు మరో పరీక్ష పెడుతున్నాయి. సహకార సంఘాల్లో రైతులకు సరిపోయినన్ని బస్తాలు ఇవ్వకపోవడంతో పొద్దంతా సాగు పనులు వదులుకొని సొసైటీ గోడౌన్‌ల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. నాలుగైదు రోజులుగా పనిగట్టుకొని వస్తున్నా చివరికి యూరియా దొరకడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్వ మండల కేంద్రంలోని సొసైటీ గోడౌన్ వద్దకు మంగళవారం తెల్లవారు జామునే వర్షానికి తడుచుకుంటూ రైతులు ఆధార్ కార్డులు, భూమి పాస్‌బుక్ జిరాక్స్ పట్టుకొని వరుసలో యూరియా బస్తాల కోసం పడిగాపులు కాశారు. ఒక్క ఎకరాకు ఒక్క బస్తా ఇస్తామనే నిబంధన పెట్టడంతో రైతులు తమ వరకు వస్తాయో లేదోనని దిగులు చెందుతున్నారు. మంగళవారం పలు గ్రామాల నుంచి రైతులు సొసైటీ గోడౌన్ వద్దకు వచ్చినా నాలుగురోజుల నుంచి తిరిగిన కొందరి రైతులకు మాత్రమే బస్తాలు దొరకడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గోడౌన్ వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్నా కొందరికి మాత్రమే బస్తాలు ఇవ్వడంతో అందనివారు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు.



వర్షంలో తడుస్తు యూరియా కోసం క్యూలో నిలుచున్న రైతులు

వసతులతో కూడిన క్రీడా మైదానం నిర్మిస్తాం

- మంత్రి వాకిటి శ్రీహరి



మక్తల్‌లోని కళాశాల వద్ద మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్/నర్వ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అసంబద్ధంగా నిర్మించిన మినీ స్టేడియాన్ని కూల్చి అన్ని వసతులతో కూడిన ఆదర్శవంతమైన క్రీడా మైదానాన్ని నిర్మిస్తామని రాష్ట్ర క్రీడా, యువజన, పాడి పరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, వైస్ చైర్మన్ సోని బాలాదేవితో కలిసి మక్తల్ మినీ స్టేడియాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల మైదానాన్ని పరిరక్షించేందుకు ఎన్నో ఏళ్లుగా న్యాయ పోరాటం చేశామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా స్టేడియం నిర్మించకపోవడంతో ఎందుకూ పనికిరాకుండా పోయిందన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి కేబినెట్ సమావేశంలోనే అత్యున్నతమైన క్రీడా పాలసీకి రూపకల్పన చేశామన్నారు. త్వరలో సీఎం కప్, మండల, రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, వైస్ చైర్మన్ సోనిబాలాదేవి మాట్లాడుతూ మక్తల్ పట్టణంలో నూతనంగా నిర్మించే మినీ స్టేడియంలో సాంకేతికపరమైన ఇబ్బందులను పరిష్కరించి క్రీడా మైదానం నిర్మాణానికి తోడ్పాటు అందిస్తామన్నారు. అనంతరం జాతీయ స్థాయి క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఎస్పీ లింగయ్య, లక్ష్మారెడ్డి, గణేష్‌కుమార్, రవికుమార్, హన్మంతు, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంఈవో అనిల్‌గౌడ్, పుర కమిషనర్ శంకర్‌నాయక్, డీవైఎస్‌వో వెంకటేష్‌శెట్టి, సీఐ రాంలాల్, ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తదితరులున్నారు.

అలాగే, మక్తల్, మాగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందించారు. సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్టు పరిషత్ రాష్ట్ర నాయకుడు వినయ్, స్థానిక నాయకులు ఇందు, కిశోర్, సందీప్, అనిల్, శ్రీధర్, నవీన్, రాకేష్ తెలిపారు.

అదేవిధంగా, నర్వ మండల కేంద్రంలోని జాంధ్రగుట్ట క్రీడా ప్రాంగణాన్ని మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండి సోనిబాలాదేవి, వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి పరిశీలించారు. స్పోర్ట్స్ విభాగం అధికారులు, నర్వ తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి బుచ్చారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్, ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మెర్సి వసంత

నారాయణపేటరూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మెర్సి వసంత అన్నారు. మంగళవారం గ్రంథాలయాలపై కళాశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల, కళాశాల, యూనివర్సిటీ స్థాయిలలో వివిధ రూపాల్లో చదువరులపై గ్రంథాలయాలు జ్ఞాన భిక్షను ప్రసాదిస్తూనే ఉంటాయన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని, నిశ్శబ్దంతో తగిన వసతులతో కూడిన ప్రశాంతమైన వాతావరణాన్ని గ్రంథాలయాలు అందజేస్తాయన్నారు. గ్రంథాలయాల్లో పుస్తకాలు, మ్యాగ్జిన్లు, వ్యాస సూచీలు, గ్రంథ పట్టికలు, బిబిలోగ్రఫీ, ఇండెక్సులు, తాళపత్ర గ్రంథాలాంటి వెలకట్టలేని వనరులు ఉంటాయని వాటిని వినియోగించుకోవాలన్నారు. అధ్యాపకులు ఉదయకుమార్, భాస్కర్‌రెడ్డి, జి.శ్రీనివాస్, డాక్టర్ శంకర్, డాక్టర్ సేఫిక్ అహ్మద్, అశోక్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

భయపెట్టి సంతకాల సేకరణ తగదు



తహసీల్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

ఊట్కూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భూముల సేకరణకు గాను తహసీల్దార్ రైతులను భయపెట్టి సంతకాలు చేయించే ప్రయత్నాన్ని అడ్డుకున్నామని భూనిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్ వద్ద ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎడవెల్లి, పెద్దపొర్ల గ్రామాల రైతులను తహసీల్దార్ స్థానిక ఎస్ఐతో కలిసి ఓ గదిలో నిర్బంధించి బలవంతంగా వారితో సంతకాలు చేయిస్తుండగా తాము వెళ్లి అడ్డుకున్నామన్నారు. రైతులను భయపెట్టి భూసేకరణ చేయొద్దన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ధర్మరాజు, తరుణ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

చాకలివానిపల్లిలో న్యాయ విజ్ఞాన సదస్సు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న కే.లక్ష్మిపతిగౌడ్

దామరగిద్ద, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రకారం న్యాయ వ్యవస్థలో ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.సురేష్, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ కే.లక్ష్మిపతిగౌడ్ అన్నారు. మంగళవారం నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి, లీగల్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు మండలంలోని చాకలివానిపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన న్యాయ వ్యవస్థలో రాజ్యాంగం కల్పించిన హక్కులు, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ధూమపానం, మద్యపానం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. న్యాయ సలహాల కోసం 15100 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.సురేష్, పంచాయతీ కార్యదర్శి రమీజాబేగం, ఏఈవో అజయ్ కుమార్, వెంకట్రాములుగౌడ్, హెడ్ కానిస్టేబుల్, పారా లీగల్ వలంటీర్ తదితరులున్నారు.

29వ రోజుకు చేరిన భూనిర్వాసితుల రిలే దీక్షలు

నారాయణపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సరైన పరిహారం కోరుతూ నారాయణపేట మునిసిపల్ పార్కు వద్ద నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం భూనిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 29వ రోజుకు చేరాయి. మంగళవారం జరిగిన దీక్షలో దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామ నిర్వాసితులు కూర్చున్నారు. దీక్షలను భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు మచ్చేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ పూలమాల వేసి ప్రారంభించారు. ఈనెల 14న నిర్వాసితులు కాత్రేవుపల్లి నుంచి ఊట్కూరు తహసీల్ వరకు పాదయాత్ర చేస్తారని, ప్రభుత్వం స్పందించకపోతే ఛలో కొడంగల్ ముట్టడి చేస్తామని నాయకులు హెచ్చరించారు. కానుకుర్తి మాజీ సర్పంచ్ భీమ్‌రెడ్డి, సంఘం గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

న్యాయమైన పరిహారం అందించే వరకు ఉద్యమిస్తాం

దామరగిద్ద, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా కానుకుర్తి రిజర్వాయర్ నిర్మాణానికి భూములు కోల్పోయే రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించే వరకు ఉద్యమం కొనసాగుతుందని మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచు శీలం బసిరెడ్డి అన్నారు. మంగళవారం రిలే దీక్షలు ఆరవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం భూసేకరణ ఆపి రైతులతో చర్చలు జరిపి న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, హన్మయ్యగౌడ్, రైతులు హనుమంతు, నారాయణ, ఎల్లప్ప తదితరులున్నారు.

నేత్రపర్వంగా రాఘవేంద్రస్వామి మహా రథోత్సవం

నారాయణపేట రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పేట పరిమళాపురం(పళ్ళ)లో వెలసిన రాఘవేంద్రస్వామి దేవాలయంలో స్వామివారి ఉత్తరారాధనోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహా రథోత్సవాన్ని నిర్వహించారు. భజన మండలి సభ్యుల భజన సంకీర్తనలు, మహిళల కోలాటాలు, నృత్యాలతో శోభాయమానంగా రథోత్సవం జరిగింది. అర్చకులు నర్సింహాచారి, అనిల్‌దేశాయి, శ్రీపాద్, రఘుప్రేంజ్యోషి, అజిలాపురం రాఘవేంద్ర, భీంసేన్‌రావు, సీతారామారావు, ధరణీధర్, శేషు, గోపీనాథ్, మంజునాథ్, మహిళలు పాల్గొన్నారు.

16న ఉట్ల వేడుకలు

నారాయణపేటరూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఈనెల 16న ఉట్ల వేడుకలు నిర్వహించనున్నట్లు చౌక్‌బజార్ మిత్రమండలి కన్వీనర్ హరినారాయణబట్టడ్ మంగళవారం తెలిపారు. 16న ఉదయం 10 గంటలకు సెంటర్ చౌక్‌లో శ్రీకృష్ణుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు, సాయంత్రం పలు పాఠశాలల చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం ఉట్టి కొట్టే వేడుక ఉంటుందని, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.